


# 10 మినిట్స్

-జూపూడి రాధాకృష్ణ

**లకడీకాపూల్!**

**అరిచేడు కండక్టర్.**

**కన్నతల్లి తన బిడ్డని అనాథలా పెంటకుప్పలో వదిలేసినట్లు వదలివెళ్ళిపోయింది హైదరాబాద్ బస్సు.**

కలకలం కోలాహలం... లకడీకాపూల్ బస్టాప్. రక్‌సాక్ బ్యాగులు, వ్యాపారపు క్యాష్ బ్యాగులూ... టీనేజీ బాల్డ్ హెడ్. చీరలూ. సల్వార్ కమీజులూ.

తిరుపతమ్మ తిరణాలంతా ఇక్కడే ఉన్నట్టుంది. ఇప్పుడే పుట్టి కేర్ మంటున్న పిల్లాడిలా నేను...

ఈ తువ్వ పొలాల్లో పురుగులు తప్ప పంటలు పండటం లేదు కొడకా!

పట్నంబోయి కంప్యూటర్ నేర్చుకోరాదా!

డిగ్రీలు అన్నం బెట్టవు గదా - నాయన పోరు!

బావురుమంటున్న ఊరు.

మట్టి కొట్టుకుపోతున్న ఊరు.

మట్టి రంగులో మనుషులూ

బకాసురుడిలా నాన్నని నమిలి మింగే కరెంటు మోటారూ...

గుట్టలా కాలిపోయిన వైండింగ్ వైరూ...

అరకొర మెకానిజంతో గొగ్గిపళ్ళతో తిరిగే పూరి మెకానిక్కు వెంకట్రావూ...

కాళ్లీడ్చుకుంటూ తిరిగే బక్క గొడ్లూ...

వల్లకాడులా వున్న ఊరూ....

పట్నం పోయి బతకరా అన్న నాన్న...

అక్కడున్నదేమిటి?

ఇక్కడున్నదేమిటి?

అది పెనం-

ఇది పొయ్యి-

పదేళ్ళ కిందటి నగరమా ఇది?

అప్పుడు తనకేసి చూడనన్నా చూడనిచ్చేది. ఇప్పుడు ఫారిన్ కార్లో వ్యాపారస్తుడిలా... నల్లచలువ అద్దాల బిల్డింగులూ...

ఆకాశంలో నీలం రంగు లేదు.

బూడిద రంగు.

మండుతున్న కళ్లు-

జావా సి++ పుస్తకాలు...

అమ్మణ్ణుల చేతుల్లో

ప్రోగ్రామింగ్ భారతాలు...

ఓరకిల్...

సాప్...

నేర్చుకుని ఏం చేస్తాడు తను?

అద్దాల్లో ఉంటాడు.

కారుకు అద్దాలు...

బిల్డింగుకు అద్దాలు...

తనకూ సమాజానికీ అద్దాలు...

వ్యాపారం - తనకీ - సమాజంతో

ఊరు?

అక్కడే ఉంటుంది.

పత్తి మండెలో నిప్పురవ్వలా రగులుతూ ఉంటుంది.

వ్యాపారపు పంటలో మిడతల్లా మాడిపోతుంటారు.

అమ్మా! నాయనా!

ఊరూ...

పత్తిపంటలో కాయలకు బదులు పురుగులు పండుతయ్.

పండిన మిరపకు రేటు కాటేస్తుంది...

బిజినెస్ ఇనర్షియా కుర్రకారును ఊరి నుంచి బైటకు నెట్టుంది.

గ్రో గ్రో రిచ్ రిచ్...

ఎవడో కవి అన్నట్లు...

'నగరం వొక దొంగలంజది'

వో జీన్స్ కుర్రాడు ఈ డిసెంబర్ చలిలో కూల్‌డ్రింక్ తాగుతున్నాడు.

డ్రింకో డ్రింక్...

మొహాలు, మొహాలు-

సిటీబస్సుల కోసం కొన్ని

బరువైన పర్సుల కోసం మొహాలు కొన్ని-

కడుపుతో వున్న మహబూబ్‌నగర్ ఆడకూలీ...

రైలింగ్స్‌ను ఆనుకొని...

పక్కనే భర్త జేబురు గడ్డంతో తట్టలూ, గడ్డపారలూ

తల్లి భూదేవి నగరంలో అడుక్కోటానికి వొచ్చినట్లుంది-

అమ్మ నగరానికి వస్తే ఇట్లాగే ఉంటుందా?

నెవర్...?!

ఊరు ఏరురా! అంటుంది అమ్మ. చేపలా గిలగిల్లాడుతుంది బయటకు వస్తే అమ్మ - బయటికి వస్తే ఊపిరి ఆడదురా అంటాడు నాన్న.

ఏమిచ్చింది? దేశం ఊరికి?

ఏమి బావుకున్నది నగరం?

హైద్రాబాద్ ఆబిడ్స్‌లో పది నిమిషాలు నించుంటే పది పెట్టెల సిగరెట్లు తాగినంత కాలుష్యం అంటాడు సుబ్రహ్మణ్యం.

ఎవరు ఎవరికి ఎప్పుడు మప్పాలి?

కాలజ్ఞానం-

ఎవరో అన్నట్టు మనిషి ఎప్పటికీ ఏదీ నేర్చుకోడు-

బాబూ...

బస్సు వొస్తుందా?

అంకుల్! పంజాగుట్ట బస్సు వెళ్ళిపోయిందా? ఓ కాన్వెంట్ కుర్రాడి ఎంక్వైరీ.

వాడి బ్యాగు పదిహేను కిలోలుండొచ్చు.

ఆల్‌మోస్ట్ ఆల్ హంచ్ బ్యాక్ వొచ్చేసింది కుర్రాడికి.

పిచ్చోడా ఎవడు బోతుండు బై యూనివర్సిల కాలేజికి? ఎడ్మిసై సివిల్స్‌కి ప్రిపేరుగా! వో యూత్‌కి ఇంకో ఎక్స్ స్టూడెంట్ సలహా!

జావాకి తోడు కొర్బా ఉండాలే.

వో కంప్యూటర్ విదుషీమణికి ఇంకో అనుభవజ్ఞురాలి సలహా!

సిటీబస్సులు ప్లాట్ మీదికి వొచ్చీ రావడంతోనే కుమ్ముకుని జొరబడుతున్నారు.

స్పీడ్! స్పీడ్!

రన్! రన్!

అనకొండ చిలువల్లా మనుషుల్ని మింగుతున్నయ్ కొన్ని బస్సులు.

ఉమ్మేస్తున్నయ్ కొన్ని బస్సులు.

అబ్బా!

కాలి పుండు మీద నుంచి తొక్కుకుంటూ పోయి

బస్సెక్కేడు వో కంగాళీ ఆసామీ. కళ్ళవెంబడి నీళ్ళు - ఉప్పుగా!

కళ్ళు తుడుచుకున్నా

హృతిక్ సుజాన్నేని పెళ్ళి చేసుకున్నాట్ట గదా.

వో స్వీట్ సిక్స్‌టీన్ ఇంకో ఫిఫ్టీన్‌తో పోచికోలు బాతాఖానీ-

పటాన్‌చెరు బస్సొస్తుందా? రాదా?

చెరువా అది? నురగల గని.

చెరువు పక్కకెళ్ళోద్దురో-

బీ హెచ్‌యీ ఎల్ రామలింగం సలహా. ఎవ్రీబడీ ఈజ్ ది రిజల్ట్ ఆఫ్ హిజ్ ఓన్ ఫేట్.

ధర్మం బాబూ ఎదురుగ్గా ఓ ఆడగొంతు.

నిజామాబాద్ టైపు చీరకట్టు.

చెవులకి దబ్బనాలు పట్టేంత కంతలూ.

గంటీలు పెట్టి ఉంటుంది ఇదివరలో

బోసినోరు

ముడతలు పడ్డ మొహం-

దర్మం బాబూ చెయ్యి జాపింది.

ఆమె ఎదురుగా పాసింజెర్లం

మా ఎదురుగా ఆమె-

చూపులతోనే పాసింజెర్ల తిరస్కారం

అడుక్కతినటానికి సిగ్గెయదుటండీ...

వో నడివయసు ఉద్యోగి కామెంటు....

చిల్లర్లేదు పో!

వో వ్యాపారి ఛీత్కారం-

కదల్లేదు ముసలిది-

మహబూబ్‌నగర్ ఆడకూలీ

బొడ్డున వున్న సంచీ విప్పింది-

ఇదుగో పెద్దమ్మా అని చేత వుంచింది రెండు అర్ధరూపాయి బిళ్ళలు-

అడిగితే ఇవ్వడం- హ్యూమన్ సెన్సిటివిటీ లక్షణం - అని నేను.

ఇన్నాళ్ళూ అనుకున్నా కష్టపడి పనిచేయకుండా అడుక్కతినడం - వాళ్ళని ద్వేషించడం నా స్వభావం కాకున్నా అది ఇన్నాళ్ళూ నా స్వభావం నుంచి ఇది ఇంత కాలం ఎందుకు పరారైందో - అర్థంకాని విషయం.

ఇన్నాళ్ళూ ఆలోచించని విషయం-

ఈ మహబూబ్‌నగర్ ఆడకూలీని చూస్తే ఓ ఆదర భావం కలుగుతోంది-

నిజమే అడిగితే ఇవ్వడం ఏదైనా సరే - మానవ హృదంలో ప్రేమా తడీ ఎండిపోకుండా ఉండేవో సజీవ స్రవంతి-

నేనెక్కవలసిన బస్సువొచ్చింది.

మియాపూర్ పోతదా బాబూ

అడిగేరు మహబూబ్‌నగర్ జంట.

పోతుంది.

ఇటుతే గడపారలు నేను లోన వేస్తా.

గడపారాలు అందుకుని బస్సు లోపల వేశాను. నా పక్కనే సీటు ఖాళీగా ఉంది.

అతన్ని నా పక్కనే కూచోబెట్టుకున్నా. మట్టివాసన - అవును మా వూరి మట్టివాసనలాగే. ★

# రాజకీయ ఫ్యాషన్ షో!

మన దేశంలో రాజకీయ నాయకులు సకల కళా ప్రవీణులు. వీరు ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగు పెడ్తే... అన్న ఆలోచన కొందరు డ్రస్ డిజైనర్లకు వచ్చింది. వెంటనే డిజైనర్లు తామైతే ఎవరెవరికి ఎటువంటి డ్రస్‌లను డిజైన్ చేయనున్నామోనని ఊహల్లోకి వెళ్లిపోయారు. ఆ ఆలోచనల రూపమే ఈ ఊహాత్మక ఫ్యాన్సీ డ్రస్ పరేడ్.



★ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి తుస్సార్ కుర్తా భేషుగ్గా ఉంటుంది. ఈ కుర్తాపై మిథిల ఆర్ట్ ప్రింటింగ్ ఉంటే దానికి తిరుగేముంది?! దీనికి జోడీగా గంగ-జమున బార్డర్ ఉన్న ధోతి ఆయన సమైక్య - సామరస్య సిద్ధాంతానికి చక్కగా సరిపోతుంది. ఇక కాషాయం బోర్డర్‌తో ఉన్న తెల్లని టోపీ, కొల్హాపూర్ 'కట్‌షూ'లు వాజ్‌పేయి కాస్ట్యూమ్స్‌కి మరింత అందాన్ని తెస్తాయి.



★ భారతీయ ఫ్యాషన్‌ను పదడుగులు వెనక్కి వేయించడానికి శాయశక్తులా కృషిచేసి సుష్మాస్వరాజ్ విజయం సాధించారు. ఎఫ్‌టీవీని నిషేధించడం, ఆ ఛానెల్‌లో భారతీయ కార్యక్రమాలను అనుమతించకపోవడం ఆమె చేపట్టిన చర్యల్లో ప్రముఖమైనవి. నగ్నత్వమే ప్రధాన సమస్య. అయితే కామసూత్రాల్ని ఎందుకు నిషేధించరు. ఏమైతేం లెండి. ఆమెకు పెద్ద ఫ్యాషన్ అక్కర్లేదు. మామూలు డ్రస్‌లే ది బెస్ట్.



★మాయావతికి బుర్ఖానే సరైన కాస్ట్యూమ్. ఆమె ఉత్తరప్రదేశ్‌కు ముఖచిత్రం వంటిది. కానీ లేస్‌పెట్టీ కోట్‌తో కింద బార్డర్ నుంచీ నిండుగా తయారైన బుర్ఖా ధరిస్తే మాయావతిని చూడటానికి వీలుకాకపోయినా, ఆమె సుస్వరం వినడానికి తాజాగా ఉంటుంది. అన్నట్లు మరిచిపోయా. ఈ బుర్ఖా ధారణతో మాయావతి ముస్లిం ఓట్లు సునాయాసంగా పొందవచ్చు.



★ ఇటలీ వనిత సోనియాగాంధీ అచ్చమైన భారతీయ నేత వస్త్రాలు ధరిస్తే ఎలా ఉంటుంది? నిజానికి ఆమె డ్రస్సింగ్ స్టైల్ చాలా నిరాడంబరంగా చక్కగా ఉంటుంది. ఈ స్టైల్‌కు ఇంకా సౌందర్యాన్ని తెచ్చేలా నడుము వరకూ పొడవైన జాకెట్, దానికి బహుచక్కగా ముత్యాల దారాలు - దీనికి తోడు చిక్కని ఎంబ్రాయిడరీతో కూడిన చీర - వెరసి ప్రపంచంలో ఎక్కడైనా ఎప్పుడైనా ఏ కార్యక్రమంలోనైనా నప్పేలా ఉంటుంది.

-ఆనంద